

మున్సిపల్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న కె.ఉమామహేశ్వరరావు

మోడీ కుతంత్రాలకు పరాకాష్ట

అరెస్టుపై పలు పార్టీల ఖండన

అధికారం కోసమే బిజెపి కుట్ర

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మూడోసారి ఎలాగైనా అధికారం చేపట్టడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర రాజకీయాలకు తెరదీస్తోందని, ఇందులో భాగమే సిఎం కేజ్రీవాల్ అరెస్టు, కాంగ్రెస్ పార్టీ ఖాతాల మూసివేత అని ఇండియా వేదిక నాయకులు కేంద్ర ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో ఇండియా కూటమి నేతలు కల్లూరి బాలసుబ్రమణ్యం, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి, ఆప్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటాచలపతి పాల్గొని మాట్లాడారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఉద్యమ పార్టీగా ఉద్భవించి పదేళ్ల కాలంలోనే జాతీయ పార్టీగా అవతరించి, అవినీతికి అడ్డుకట్ట వేసిందని అలాంటి పార్టీ ముఖ్యమంత్రి తమకు వత్తాసు పలకలేదని కక్ష సాధింపు చర్యతో అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ ఖాతాలను సీజ్ చేయడం బిజెపి కుట్ర రాజకీయాలకు నిదర్శనం అన్నారు. మతోన్మాదాన్ని ప్రేరేపిస్తూ, దేశాన్ని విచ్ఛిన్నం చేసే దిశగా బిజెపి కుయుక్తా రాజకీయాలు చేస్తోందని, దేశ ప్రజలు బిజెపి చేస్తున్న అరాచకాలను గమనిస్తున్నారన్నారు. జరగబోయే ఎన్నికల్లో దేశ ప్రజలు భారతీయ జనతా పార్టీని తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు.

విలేకరుల సమావేశంలో ఇండియా వేదిక నాయకులు

కేంద్రంలో అధికారం చేపట్టేది కాంగ్రెస్సే : దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) రాబోయే ఎన్నికల్లో ఇటు కేంద్రంలోనూ, అటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. తిరుపతి సందర్శనార్థం వచ్చిన మంత్రిని పీసీసీ ప్రధాన కార్యదర్శి గౌడపేర చిట్టిబాబు, తిరుపతి జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు చిత్తూరు శివశంకర్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని, ఖచ్చితంగా బిజెపి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడుతుందని అన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో కేజ్రీవాల్ అరెస్టు కేంద్ర ప్రభుత్వ లౌకిక ప్రజాస్వామ్యవాదుల గొంతు నొక్కే చర్య.. ఎలక్ట్రోరల్ బాండ్ల కుంభకోణాన్ని పక్కదోవ పట్టించేందుకు, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా కేజ్రీవాల్ అరెస్టు చేయడం వెనుక కుట్ర దాగి ఉందన్నారు. కేజ్రీవాల్ అరెస్టును పలు పార్టీలు ఖండించాయి.

ఎలక్ట్రోరల్ బాండ్లు పక్కదారి పట్టించేందుకే : వి.నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

బిజెపి ఎలక్ట్రోరల్ బాండ్ల కుంభకోణాన్ని ప్రతిపక్షాలు బయట పెట్టడంతో పక్కదారి మళ్లించేందుకు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. ఇది అప్రజాస్వామిక చర్య. ఈ దుర్మార్గాన్ని రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఖండించకపోవడం ప్రజాస్వామ్యానికే మచ్చ. ఎన్నికల వేళ దేశ ప్రజలు బిజెపికి తగిన గుణపాఠం చెబుతారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే : నవీన్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్

ప్రతిపక్షాల అరెస్టులతో, ఈడీ దాడులతో భయపెట్టేందుకే బిజెపి కుట్ర పన్నుతోంది. ఎన్నికల్లో బిజెపి అక్రమాలు, అవినీతిని ప్రజలు చూస్తూ ఊరుకోరు. ఎన్నికల్లో ఓటు రూపంలో ఆ పార్టీకి బుద్ధి చెబుతారు. కేజ్రీవాల్ అరెస్టును కాంగ్రెస్ ఖండిస్తోంది.

బిజెపి పాలిత ప్రాంతాల్లో దాడులెక్కడ? : పి.అంజయ్య, ఆర్‌పిఐ

బిజెపి పాలిత ప్రాంతాల్లో అవినీతి అక్రమాలు జరగలేదా? తమకు లొంగని ప్రాంతీయ పార్టీలపై కక్షగట్టి దాడులు చేయడం శోచనీయం. లౌకికవాదులు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా బిజెపి ఆగడాలను అడ్డుకోకపోతే ఈ దేశ భవిష్యత్ సర్వనాశనం అవుతుంది.

మరీ దారుణం : చిన్నం పెంచలయ్య, సిపిఐ

కేజ్రీవాల్ అరెస్టు మరీ దారుణం. ఓ ముఖ్యమంత్రిని సైతం మోడీ ప్రభుత్వం వదలడం లేదు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించినా ఇంకా ప్రభుత్వ హుకుం ఏంటి? ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలి. ప్రజాస్వామ్యవాదులు బిజెపి ఆగడాలను ప్రచారం చేసి జనాన్ని చైతన్యవంతులను చేస్తున్నారనే ఇలాంటి చర్యలు.

ఇండియా కూటమిని ఎదుర్కోలేకే : చింతామోహన్, కేంద్ర మాజీ మంత్రి

ఎన్నికల సమయం దగ్గర పడడంతో ఇండియా కూటమిని ఎదుర్కొనే శక్తి లేక బిజెపి అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది. ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించి కేజ్రీవాలను అరెస్టు చేయించింది. కేజ్రీవాల్ అరెస్టులో ప్రభుత్వ యంత్రాంగం వేగంగా కదిలింది. మిగిలిన ముఖ్యమంత్రుల విషయంలో ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. బిజెపి ఎన్ని కుతంత్రాలు పన్నినా ఇండియా కూటమి విజయం ఖాయం.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

మున్సిపల్ కార్మికులు భారీగా సిఐటియులో చేరిక

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఐక్య పోరాటాలను ఉధృతం చేయాలని, సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు భారీ సంఖ్యలో శుక్రవారం ఎఐటియుసి నుంచి సిఐటియు యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తున్న ఏకైక కార్మిక సంఘం సిఐటియు అన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై పోరాటాలు చేసి జీవోలు సాధించిన చరిత్ర యూనియన్‌కు ఉందన్నారు. అలాంటి సిఐటియులో కార్మికులందరూ చేరడం అభినందనీయమన్నారు. కార్మికులపై పనిభారం పెరుగుతోందని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు చెప్పినట్లు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర సమ్మెలో ప్రభుత్వం, కొన్ని సంఘాలు కార్మికులను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించినా, పోటీ కార్మికులను పెట్టాలని చూసినా కార్మికులందరూ ఎక్కడికక్కడ ఐక్యంగా అడ్డుకున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఎట్టకేలకు దిగివచ్చి మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచుతూ ఇతర సమస్యలపై పరిష్కారం చేసే దిశగా జీవోలు విడుదల చేసిందని, ఇది మున్సిపల్ కార్మికుల విజయం అన్నారు. పర్మినెంట్ ఉద్యోగులు ప్రతి సంవత్సరం అత్యధిక స్థాయిలో రిటైర్ అవుతున్నా, వారి స్థానాల్లో శాశ్వత ఉద్యోగాలు ఇవ్వకుండా తాత్కాలిక ఉద్యోగాలు ఇవ్వడం వల్ల ఉద్యోగులకు భద్రత లేకుండా పోతుందన్నారు. శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పోరాటాలను ఉధృతం చేయడం ద్వారా ప్రభుత్వాలు దిగి వచ్చాయన్నారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులు చేసిన పోరాటం వల్ల కార్మిక సమస్యలు పరిష్కారం అయ్యేలా పోరాటం నడిచిందన్నారు. చిత్తూరు కార్పొరేషన్‌లోనూ ప్రభుత్వం ఇచ్చిన జీవోల ప్రకారం ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సంక్రాంతి అలవెన్స్ వెయ్యి రూపాయలు వెంటనే అమలు చేయాలని, యూనిఫామ్, చెప్పులు, సోపులు ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం తప్ప వేరే మార్గం లేదన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, యూనియన్ నాయకులు నాగరాజు, సుబ్రమణ్యం, గోపీ పాల్గొన్నారు.

చిత్తూరు ఎంపి అభ్యర్థిగా దుగ్గిమళ్ల ప్రసాద్‌రావు

సర్వేపల్లి అసెంబ్లీకి సోమిరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో టిడిపి అధినేత తమ పార్టీ నుంచి పోటీచేసే అభ్యర్థుల మూడో జాబితాను శుక్రవారం ప్రకటించారు. టిడిపి - జనసేన - బిజెపి కూటమిలో చిత్తూరు ఎంపి అభ్యర్థిగా దుగ్గిమళ్ల ప్రసాద్‌రావును ప్రకటించారు. ఆయన బాపట్ల జిల్లా తిప్పసముద్రం వాస్తవ్యుడు. ఐఆర్‌ఎస్ చదివి దేశవ్యాప్తంగా వివిధ హోదాల్లో పనిచేసి రిటైర్ అయ్యారు. ప్రస్తుతం విశ్రాంత అధికారిగా టిడిపి ఎంపి అభ్యర్థిగా చిత్తూరు నుంచి బరిలో దిగనున్నారు. అలాగే తిరుపతి జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం అసెంబ్లీకి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ప్రకటించారు.

చీలికలు...పీలికలుగా..!

టిడిపి అభ్యర్థి సుధీర్‌రెడ్డికి రెబల్స్ బెడద

ఎవరికి వారే 'స్వతంత్ర' అభ్యర్థులుగా బరిలోకి

నా గెలుపు ఆపే దమ్ము ఎవరికీ లేదు : బొజ్జల

శ్రీకాళహస్తిలో 'కాకా' రాజకీయం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో శ్రీకాళహస్తిలో టిడిపి - జనసేన - బిజెపి కూటమి చీలికలు పీలికలయ్యింది. ఎవరికి వారే సీటును ఆశిస్తూ రచ్చకెక్కుతున్నారు. కూటమి అభ్యర్థిగా అధినేత చంద్రబాబు ప్రకటించిన బొజ్జల సుధీర్‌రెడ్డికి రెబల్స్ బెడద తప్పేలా లేదు. తామూ టిక్కెట్ రేస్‌లో ఉన్నామని, అధిష్టానం పునరాలోచించకపోతే స్వతంత్రంగానైనా బరిలోకి దిగుతామని అల్టిమేటం ప్రకటించారు. బిజెపి నుంచి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పోటీలో ఉన్నానని అధికారికంగా ప్రకటించి ఢిల్లీ నుంచి పావులు కదుపుతున్నారు. వైసిపి నుంచి టిడిపి కండువా కప్పుకున్న మాజీ ఎంఎల్ఎ ఎస్సీవీ నాయుడు తన రాజకీయ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని సీటు తనకే కావాలని పట్టుబడుతున్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోటా వినుత తానూ బరిలో ఉన్నానని వెల్లడించారు. ఇదేగనుక జరిగితే శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్‌రెడ్డి టిడిపి అభ్యర్థిగా బరిలో దిగితే స్వతంత్ర అభ్యర్థులుగా మిగిలిన వారు బరిలో దిగే అవకాశం ఉందని చర్చ నడుస్తుంది. నిజంగానే స్వతంత్రంగా బరిలో దిగుతారా? లేక ఏదైనా లబ్ది ఆశించి కాకా రాజకీయం చేస్తున్నారా? అన్నది వేచి చూడాల్సిందే.

శ్రీకాళహస్తి తొలినుంచి టిడిపికి కంచుకోట. ఒకప్పట్లో ముఖ్యమంత్రి అభ్యర్థి నీలం సంజీవరెడ్డి ఇక్కడినుంచే గెలిచారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలక్రిష్ణారెడ్డి హ్యాట్రిక్ సాధించారు. 2019 ఎన్నికల్లో తొలిసారిగా వైసిపి ఎంఎల్‌ఎగా బియ్యపు మధుసూదన్‌రెడ్డి గెలుపొందారు. తండ్రి బొజ్జల గోపాలక్రిష్ణారెడ్డి మరణానంతరం కుమారుడు బొజ్జల సుధీర్‌రెడ్డి రాజకీయ వారసునిగా వచ్చారు. చంద్రబాబు సైతం అతనికే టిక్కెట్ ఇచ్చారు. అయితే బిజెపి నుంచి కోలా ఆనంద్, జనసేన నుంచి కోటా వినుత నియోజకవర్గ ఇన్‌ఛార్జిలుగా ఉన్నారు. ఎన్నికల్లో ఎవరికి వారే కూటమిలో భాగంగానే సీటు కోసం మూడు పార్టీలూ పోటీ పడ్డాయి. మాజీ ఎంఎల్‌ఎ ఎస్సీవీ నాయుడు సీటు కోసమే టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. అయితే బొజ్జల సుధీర్‌రెడ్డికి సీటును ప్రకటించడంతో రెబల్స్ అందరూ ఏకమయ్యారు. తమలో సీటు ఎవరికిచ్చినా పర్వాలేదని, బొజ్జల సుధీర్‌రెడ్డికి మాత్రం ఇవ్వరాదని పట్టుబట్టి ఉన్నారు. కూటమి ధర్మంలో భాగంగా బిజెపి నుంచి తనకు ఇవ్వాలని కోలా ఆనంద్, జనసేన నుంచి తనకే కావాలని కోటా వినుత వీధికెక్కారు. అందరూ ఒక్కటైనా తన గెలుపును ఆపలేరని బొజ్జల సుధీర్‌రెడ్డి మీడియాకు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ రెబల్స్ రచ్చ మూడు పార్టీల అధినేతలకూ తలనొప్పిగా మారింది.

శ్రీకాళహస్తిలో టిడిపి - జనసేన - బిజెపి కూటమి రెబల్స్ వీరే...

దొంగ ఓట్ల కేసు దర్యాప్తు వేగవంతం చేయాలి : ఆరణి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ తిరుపతి నియోజకవర్గంలో నమోదైన దొంగ ఓట్ల వ్యవహారంపై విచారణ వేగవంతం చేయాలని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు (జేఎంసి) కోరారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిణి, మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ అయిన అదితి సింగ్ ను ఆరణి శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ లు కలిశారు. ఈ సందర్భంగా దొంగ ఓట్ల వ్యవహారంపై దర్యాప్తు వెంటనే పూర్తి చేయాలని రిటర్నింగ్ అధికారిణిని వారు కోరారు. ఈ వ్యవహారంలో సూత్రధారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దొంగ ఓట్ల వ్యవహారంకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిపేలా చూడాలన్నారు. దొంగ ఓట్ల వ్యవహారంలో దర్యాప్తు కొనసాగుతోందని పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని అదితి సింగ్ వారికి తెలిపారు.

ఎన్నికల ప్రచారం ప్రారంభించిన అభినయ్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ రానున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని తిరపతి వైఎస్‌ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. తన తండ్రి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తో కలిసి తాతయ్య గుంట గంగమ్మ కి పూజలు నిర్వహించారు. స్థానిక 10,11 డివిజన్లలో ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇంటింటికీ వెళ్తూ కరపత్రాలను అందజేస్తూ తనకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. తిరుపతి అభివద్ధికి అహర్నిశలు కషి చేస్తున్న తనను ఆదరించి గెలిపించాలని కోరారు. దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, శంకర్ రెడ్డి, ప్రవల్లిక రెడ్డి, మునిశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

'సి' విజిలేస్తే... చూసేస్తారు..!

5 నిమిషాల్లోనే ఘటనా స్థలానికి

100 నిమిషాల్లో ఫిర్యాదుకు పరిష్కారం

అందుబాటులో 'సి విజిల్ యాప్'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దిశా నిర్దేశం చేసే..సార్వత్రిక ఎన్నికల(2024)కు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్) అమల్లోకి వచ్చేసింది. ఈ ఎన్నికలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఈ నేపథ్యంలో అక్రమాలకు, నిబంధనల ఉల్లంఘనలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వాటికి అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఇందులో పౌరులను సైతం భాగస్వాములను చేస్తోంది. 'సి విజిల్' యాప్ ద్వారా ఈ అవకాశం కల్పించింది. దాని గురించి తెలుసుకుని, నిబంధనలు ఉల్లంఘించే వారి పని పట్టండిలా...

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఈ 'సి విజిల్' యాప్ అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా అందులో పొందుపరచవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన 5 నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు. దీన్ని పౌరులు ఎవరైనా వినియోగించవచ్చు. పార్టీలకు అతీతంగా ఎవరు అవినీతికి పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

రిజిస్టర్ చేసుకోండిలా..

ముందుగా గూగుల్ ప్లే స్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం వారి 'సి విజిల్' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. మీ చరవాణి నంబరు ద్వారా దానిలో రిజిస్టర్ చేసుకోవాలి. ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేస్తే 'సి విజిల్' యాప్ సిద్ధమైనట్లే. దాని ద్వారా మీరు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

ఎలాంటివి చేయవచ్చంటే...

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైనైనా ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం. ఇలాంటి ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రికార్డ్ చేసి అప్‌లోడ్ చేయండి.

ఎలా చేయాలంటే...

మీ యాప్ తెరవగానే తెరపై 'ఫొటో', 'వీడియో', 'ఆడియో' అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. మీరు ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫొటో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. మీ లొకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఫొటోను అప్‌లోడ్ చేయండి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాలి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. ఇది ఎన్నికల సంఘానికి చేరుతుంది.

5 నిమిషాల్లో రంగంలోకి అధికారులు

యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి 5 నిమిషాల్లో.. దానిని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. విచారించి, 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. ఆయన దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా 100 నిమిషాల్లో సి విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది.

అడ్డుకట్ట వేయండి..

తాయిలాలు పంచి, అక్రమాలకు పాల్పడి అధికార పీఠం ఎక్కాలనుకునే అరాచక రాజకీయ పార్టీలకు ఈ యాప్ ద్వారా చరమ గీతం పాడొచ్చు. ఈ రోజే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని.. ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘన కనిపిస్తే ఫిర్యాదు చేయండి. అక్రమాలకు అడ్డుకట్ట వేయండి. మీ పిల్లలు, రాష్ట్ర బంగారు భవిష్యత్తు కోసం.. మీ వంతు బాధ్యతను నిర్వర్తించండి.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే 'సీ విజిల్'కు ఫిర్యాదు

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై సీవిజిల్ యాప్ కు ఫిర్యాదు చేయండి అని తిరుపతి నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ ఐఏఎస్ ఓ ప్రకటనలో తెలియజేసారు. అదేవిధంగా కంట్రోల్ రూములోని 0877-2256766 ఈ నంబర్ కి కాల్ చేసి ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ప్రచార ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వాహనాలకు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. వివిధ ఫారాలు క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ పెండింగ్ ఉన్నవాటిని ఈ నెల మార్చి 26 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం సిఈఓ కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో రానున్న సాధారణ ఎన్నికలు 2024 సన్నద్ధతకు సంబందించిన పలు అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో శుక్రవారం మధ్యాహ్నం సమీక్ష నిర్వహించారు.జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీ శ సంబంధిత అధికారులతో కలిసి తిరుపతి కలెక్టరేట్‌లో హాజరయ్యారు. కమాండ్ కంట్రోల్ రూం లు ఏర్పాటు ఉండాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో శాంతి భద్రతలు పర్యవేక్షణ, సీజర్ ఆఫ్ క్యాష్, లిక్కర్, డ్రగ్స్ తదితరాలపై చెక్ పోస్టులు, స్టాటిక్ సర్వైవలెన్స్ టీంలు, సంబంధిత ఫ్లయింగ్ స్క్వాడ్ లు మరింత చైతన్యవంతంగా పని చేయాలని సూచించారు.డిఆర్ఓ పెంచల కిషోర్, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఎన్నికల డిటి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల్లో అన్ని సౌకర్యాలు ఉండాలి : అదితి సింగ్

జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోలీసు స్టేషన్లలో అన్ని సౌకర్యాలు ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అదితిసింగ్ సూచించారు. తిరుపతిలోని ఖాదీకాలనీ, హౌసింగ్ కాలనీ, అన్నారావు సర్కిల్, ఎన్జీవో కాలనీలలో పోలింగ్ జరిగే కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఇళ్ల వద్ద ప్రజలతో మాట్లాడుతూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, ఉప కమిషనర్ అమరయ్య, సెక్టొరల్ ఆఫీసర్ మదుసుధన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణితం పరీక్ష

ప్రజాశక్తి - తిరుపతి పదో తరగతి పరీక్షల్లో నాలుగో రోజైన శుక్రవారం గణిత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. తిరుపతి జిల్లాలో 162 పరీక్ష కేంద్రాల్లో , 6 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 162 మంది చీఫ్ సూపరింటెండెంట్ లు, 1753 మంది ఇన్విజిలేటర్ల పర్యవేక్షణలో నిర్వహించిన గణిత పరీక్షకు మొత్తం 27,182 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 26,641 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. మిగిలిన 541 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ పేర్కొన్నారు. 98 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రకటించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

నారా భువనేశ్వరికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ 'నిజం గెలవాలి' పర్యటనలో భాగంగా కడప జిల్లా బద్వేల్ నుండి సైదాపురం మీదుగా గూడూరుకు విచ్చేసిన నారా భువనేశ్వరికి తిప్పవరపాడు గ్రామం నందు టీడీపి ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్ కుమార్ , నాయకులు, తెలుగు మహిళలతో కలసి ఘన స్వాగతం పలికారు. చిల్లకూరు మండల పరిధిలోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్లో రాత్రికి బస చేయనున్నారు. శనివారం మహిళలతో మాటామంతి కార్యక్రమం, వాకాడు మండలం తిరుమూరు గ్రామంలో 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా మృతిచెందిన వెంకటస్వామి కుటుంబాన్ని పరామర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసరావు, కొండూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాపూరు ఎన్నికల ప్రచారంలో భాగంగా పెంచలకోనకు విచ్చేసిన చంద్రబాబుకు ఆహ్వానం పలుకుతున్న వెంకటగిరి నియోజకవర్గ టిడిపి నేతలు

24, 25 తేదీల్లో తుంబురుతీర్థ ముక్కోటి

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీ తుంబురు తీర్థ ముక్కోటి ఉత్సవం మార్చి 24, 25వ తేదీల్లో ఘనంగా జరగనుంది. తీర్థానికి విశేషంగా విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. తుంబురు తీర్థానికి మార్చి 24వ తేదీ ఉదయం 5 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు, మళ్లీ మరుసటి రోజైన మార్చి 25వ తేదీన ఉదయం 5 నుండి 11 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతిస్తారు. పాపవినాశనం డ్యామ్ వద్ద భక్తులకు అల్పాహారం, అన్నప్రసాదాలు, తాగునీరు అందిస్తారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, అంబులెన్సులు, మందులు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంటాయి. తీర్థానికి ఎక్కువ దూరం నడవాల్సి వస్తుంది కావున గుండె, శ్వాస కోశ సమస్యలు, స్థూలకాయం ఉన్నవారికి అనుమతి లేదు.

ఘనంగా శాలివాహన చక్రవర్తి జయంతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శాలివాహన చక్రవర్తి జయంతిని నగర పరిధిలోని మెల్ల విగ్రహం వద్ద శుక్రవారం టిడిపి తిరుపతి పార్లమెంటు శాలివాహన కమిటీ కన్వీనర్ ఆముదాల లక్ష్మీపతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శాలివాహన శకంకు నాందిగా నిలిచిన శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలను నిర్వహించుకోవడం కుమ్మరి సామాజిక వర్గం అదృష్టంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, రెడ్డప్ప, మల్లికార్జున, నరసయ్య, గురవయ్య, వెంకటేష్, గురుస్వామి, అర్జునయ్య, నరేష్ పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): టిడిపి చంద్రగిరి నియోజకవర్గ అభ్యర్థి పులివర్తి నాని కుమారుడు పులివర్తి వినిల్ మండలం గంగుడు పల్లి పంచాయతీ లో మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని- 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా చంద్రగిరి మండలం గంగుడుపల్లి పంచాయతీలో పులివర్తి వినీల్ ఆధ్వర్యంలో 15 కుటుంబాలు ఆ పార్టీలో చేరాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పార్టీల నాయకులు, అనుబంధ సంస్థ నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: ఒక్క అవకాశం ఇస్తే రామచంద్రాపురం మండలంలో ఉన్న రాయలచెరువు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం సి.కాళేపల్లిని పంచాయతీలో సూరవారిపల్లి, గొల్లపల్లి, చిట్టతూరు కాలేపల్లి పర్యటించారు. ఈ సందర్భంగా పలు హామీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎం తిరుమలరెడ్డి, జనార్దన్ చౌదరి, టి చిరంజీవి రెడ్డి, కె గిరిధర్ రెడ్డి,సురేంద్ర నాయుడు, వై మణిరెడ్డి, మురళీమోహన్ రెడ్డి, ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యవేడు టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి -సత్యవేడు: వైసీపీ అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఐదేళ్లు టిడిపి కార్యకర్తలపై అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడి అక్రమ కేసులతో టిడిపి జెండా పట్టుకున్న ప్రతి ఒక్కరిని హింసించిన ఎమ్మెల్యే ఆదిమూలంకు టిడిపి టికెట్ ఇచ్చి సత్యవేడు కంచుకోటను కూల్చొద్దని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిష్టానానికి నిరసన తెలిపారు. సత్యవేడు మండలం మదనం బేడులో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదిమూలం అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదిమూలం కనుసన్నలోనే టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదయ్యాయని , అలాంటి వ్యక్తికి ఈరోజు ఎలా పని చేయాలని ప్రశ్నించారు. ఆదిమూలంని అభ్యర్థిగా కొనసాగిస్తే సహకరించేది లేదని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో మదనంబేడు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరదయ్యపాలెం: సత్యవేడు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదిమూలంను ప్రకటించినప్పటి నుంచి మండలంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తమ అసంతృప్తిని ఏదో రూపంలో వ్యక్తపరుస్తూనే ఉన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని ముఖ్య టిడిపి కార్యకర్తలు నాయకులు కల్కి కోచింగ్ సెంటర్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న టిడిపి నాయకులను సంప్రదించకుండా హైకమాండ్ నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా సభ్యురాలు ముని భూషణమ్మ మాజీ మండల అధ్యక్షుడు చలపతి నాయుడు, మధునాయుడు, హరినాయుడు, మండల ప్రధాన కార్యదర్శి యం. దశరథన్, వెంకయ్య పాల్గొన్నారు.

అధ్యాపకుల రిక్రూట్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విద్యాలయంలోని మోడల్ కెరీర్ సెంటర్లో అరుణాచల్ ప్రదేశ్లోని వివేకానంద కేంద్ర పాఠశాలల్లో సంస్కృత అధ్యాపకుల నియామకాలకు రిక్రూట్మెంట్ డ్రైవ్‌ను విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విసి ఆచార్య జిఎస్ఆర్ కృష్ణమూర్తి విచ్చేసి విశ్వవిద్యాలయంలో చదివేటువంటి విద్యార్థులకు అధ్యాపనంతో పాటుగా వారి ఉద్యోగం-ఉపాధి విషయంలో శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగానే మోడల్ కెరీర్ సెంటర్ ద్వారా అరుణాచల్ ప్రదేశ్ లోని వివేకానంద కేంద్ర పాఠశాలల్లో సంస్కృత అధ్యాపకులకు టీజీటీ ఇంటర్వ్యూలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.జె.రమశ్రీ, మోడల్ కెరీర్ సెంటర్ కోఆర్డినేటర్ డా.జె.బి చక్రవర్తి, అరుణాచల్ ప్రదేశ్ లోని వివేకానంద కేంద్ర పాఠశాల ప్రిన్సిపల్ కె.జయసర్కార్, హెచ్.ఆర్ డిపార్ట్మెంటు అనిమేష్, ఎం.మురళీమోహన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి - మంగళం (తిరుపతి): రేణిగుంట మండలంలోని కరకంబాడి రోడ్డులో ఉన్న అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో శుక్రవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా. సి. నాదముని రెడ్డి మాట్లాడుతూ జాతీయ సేవ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని సోమవారం నుండి మర్రిమంద గ్రామంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వీధులని శుభ్రం చేశారు. పాఠశాల దేవాలయాల దగ్గర ఉన్న ముళ్లపొదలను తొలగించారు. వైద్య శిబిరం గురించి గ్రామం లోని ప్రతి ఇంటికి వెళ్లి సమాచారం ఇచ్చారు. మూడవ రోజు బుధవారం మర్రిమంద గ్రామంలోని యమ్ పి యు పి స్కూల్ లోని విద్యార్థుల కె విద్య మీద అవగాహన నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల అందరికి క్రీడలు ఆటలు నిర్వహించి బహుమతులు అందించారు. ప్లాస్టిక్‌నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యన్ ఎస్ ఎస్ సమన్వయకర్తలు, వాలంటీర్లు,పి ఎ బాలకృష్ణ పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు పిఎస్ పరిధిలో శుక్రవారం ఏర్పేడు ఎస్ఐ ఆధ్వర్యంలో బిఎస్ఎఫ్ బలగాలతో పాటు ఎన్నికల కోసం పాపానాయుడుపేట, వికృతమాల, గోవిందవరం, మునగలపాలెం గ్రామాలలో పోలీసు కవాతు నిర్వహించారు.

తిరుపతి సిటీ: అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్.ఎన్. అమ్మిరెడ్డి, జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ ఆధ్వర్యంలో తిరుపతి సబ్ డివిజన్, అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. శుక్రవారం స్థానిక అలిపిరి నుండి ఫ్లాగ్ మార్చ్ ప్రారంభమై సత్యనారాయణపురం, రాఘవేంద్ర నగర్ మీదుగా రాజీవ్ గాంధీ కాలనీ, జీవకోన, క్రాంతి నగర్, అంబేద్కర్ సర్కిల్, సత్యనారాయణపురం జడ్పీ హైస్కూల్ ప్రాంతాల పరిధిలో సాగింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కులశేఖర్, శ్రీనివాసరావు, బిఎస్ ఎఫ్ కమాండెంట్ మురళి, డీఎస్పీలు భాస్కర్ రెడ్డి, రమణ కుమార్, రవీంద్రారెడ్డి, రమణయ్య, సీఐ రామచంద్ర రెడ్డి, అబ్బన్న, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, అసిస్టెంట్ కమాండెంట్ సంజీవ్, గౌరీ శంకర్ మీనా, అలిపిరి పోలీస్ స్టేషన్ సిబ్బంది, జిల్లా స్పెషల్ పార్టీ పోలీసులు, బి ఎస్ ఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం మంజూరు చేయండి..

ప్రజాశక్తి - బాలాయపల్లి: శ్మశాన వాటికకు స్థలం మంజూరు చేయాలని మండల గిరిజనులు తహశీల్దారుకు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ శ్మశానానికి స్థలం లేక అవస్థలు పడుతున్నామని తెలిపారు. గిరిజనవాడలో ఎవ్వరైనా మృతి చెందితే శ్మశాన స్థలం లేక ఎక్కడ పూడ్చాలో అర్థం కాక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.గిరిజనులకు శ్మశాన స్థలం కేటాయించాలని పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని, పదేళ్లు అవుతున్నా స్పందన లేదన్నారు. తహశీల్దారు స్పందిస్తూ ప్రభుత్వ స్థలం ఎక్కడ ఉందో సేకరించి దాని మండల కేంద్రంలో ఉన్న గిరిజనులకు శ్మశాన స్థలం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

వైసిపి నేత ప్రభాకర్ రెడ్డి కన్నుమూత

ప్రజాశక్తి - ఓజిలి: వైసీపీ సీనియర్ నాయకులు ముమ్మారెడ్డి ప్రభాకర్ రెడ్డి శుక్రవారం కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరు ప్రైవేట్ హాస్పిటల్ లో తుది శ్వాస విడిచారు. మండల పరిధిలోని కురుగొండ గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నేత ,రాజకీయ చాణిక్యుడు ముమ్మారెడ్డి ప్రభాకర్ రెడ్డి రాజకీయ రంగ ప్రవేశం నెల్లూరు జిల్లా మాజీ ముఖ్యమంత్రులు నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, వైయస్ రాజశేఖరరెడ్డి లతో మంచి సత్సంబంధాలు కలిగిన నేత . రాజకీయంగా ఆయన వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల పరిధిలో అనుభవం కలిగిన సీనియర్ నాయకుడు. ఆయన సతీమణి ముమ్మారెడ్డి ఇందిరమ్మ ఓజిలి మండల పరిషత్ అధ్యక్షురాలిగా సేవలందించారు. అదే కాక నాయకుడిగా వైసిపి సీనియర్ నాయకులు కల్లు సుధాకర్ రెడ్డి బావమరిది కావడం విశేషం. జగన్మోహన్ రెడ్డి వైసిపి స్థాపించిన తరువాత ఆ పార్టీలో చేరి మండలంలో వైసిపి బలోపేతానికి ఎనలేని కృషి చేశారు. పార్టీలో నాయకులతోనూ కార్యకర్తలను కలుపుకుని పోయే మనస్తత్వం కలిగిన వ్యక్తి కావడంతో ఆయనతో ఉన్న అనుబంధం ఆకస్మిక మరణంతో రాజకీయాలకు అతీతంగా నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో కురుగొండ గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. శనివారం స్వగ్రామం కురుగొండ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అనుమతుల్లేని క్వారీల పేలుళ్లతో భయాందోళన

చర్యలు తీసుకోవాలని తహశీల్దారుకు వినతి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిక: మండలంలోని సేలం వారి కాలనీలో క్వారీల పేలుడుతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారని అనుమతుల్లేని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ కాలనీ ప్రజలు బుచ్చినాయుడు కండ్రిగ మండల తహశీల్దారు చంద్రబాబునాయుడుకి సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు రమణయ్య, ధనంజయులు మాట్లాడుతూ సేలం వారి కాలనీలో సుమారు 52 సంవత్సరాలుగా నివసిస్తున్నారని కూలీనాలు చేసుకొని జీవనం సాగిస్తున్నారని ఆ గ్రామంలో సర్వే నెంబరు 314, 315, 316, 317, 330లలో భూమిలో 20 సంవత్సరాలుగా అక్రమంగా ప్రభుత్వం వారు ఎన్‌వోసి ఇచ్చారని, మేత పోరంబోకు భూముల్లో క్వారీలు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. అక్రమ క్వారీలపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు గతంలో ఎన్నో సార్లు విన్నవించామని, అయినా రెవెన్యూ అధికారులు వారిపై చర్యలు తీసుకోలేదని, తమపైనే తప్పుడు కేసులు బనాయించారని గ్రామస్తులు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా భారీ పేలుడు పదార్థాలతో పేల్చారని దాని ప్రభావంతో రాళ్లు గుట్టలు గుట్టలుగా పడ్డాయన్నారు. ఆ ప్రదేశంలో మనుషులు లేని కారణంగా ప్రాణాపాయం తప్పిందన్నారు. పడుతున్న రాయి 10 కేజీల నుండి 15 కేజీల వరకు వున్నాయన్నారు. 40 గ్రామానికి చెందిన దళితులు ఊరి సమీపంలో వేరుశనగ ఎండ బెట్టుకుంటున్నారని అదే ప్రాంతంలో రాళ్లు పడడం ప్రాణాపాయ ప్రమాదం ఏర్పడుతోందని వాపోయారు. ఈ దుస్థితిని గతంలో అధికారులకు విన్నవించుకున్నా పట్టించునే నాథుడే కరువయ్యారన్నారు. ప్రమాదకరంగా మారిన క్వారీల కారణంగా కాలుష్యం లోపించి ఓ వ్యక్తి మరణించాడని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి అనుమతుల్లేని క్వారీలను రద్దుచేసి చర్యలు తీసుకోవాలని తహశీల్దారుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నెలవాయి గ్రామస్తులు, శాలం గ్రామస్తులు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ఇంధన రంగంలో వినూత్న పరిష్కారాల ఆవశ్యకత అవసరం

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): ఇంధన రంగంలో వినూత్న పరిష్కారాల ఆవశ్యకత ఎంతైనా అవసరమని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో మేధావులు పేర్కొన్నారు. ఇన్నోవేషన్స్ అండ్ సొల్యూషన్స్ ఫర్ ది ఫ్యూచర్' అనే థీమ్తో 'ఎనర్జీ, కంట్రోల్, కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్' (ఐసిఇసిసిఇ -2024) పై 5వ అంతర్జాతీయ సదస్సు మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో ప్రారంభమైంది. మోహన్ బాబు విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్, డిపార్ట్మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ సహకారంతో ఐఏసిటిఇ ఐడిఇఎ ల్యాబ్ ఈ సమావేశం నిర్వహించింది. బిట్స్ పిలానీ (గోవా క్యాంపస్) నుండి డాక్టరు దీపాంకర్ పాల్, ఎన్ఐటి ట్రిచీ నుండి డాక్టర్ వి శంకరరాయణన్, గుర్గావ్లోని ఎయుపిటిసి నుండి గోపాల్ హల్దర్, మోహన్ బాబు యూనివర్శిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, మోహన్ బాబు యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ నాగరాజ్ రావుతో సహా విశిష్ట వక్తలు పాల్గొని సదస్సు సావనీర్‌ను విడుదల చేశారు. కాన్ఫరెన్స్ మొదటి రోజు, 'పవరింగ్ టుమారో : ఇన్నోవేషన్స్ ఇన్ ఎనర్జీ ఇన్ఫ్రాస్ట్రక్చర్' అనే పేరుతో ఒక కీలకమైన ప్యానెల్ డిస్కషన్ ప్రధాన వేదికగా నిలిచింది. ప్యానెలిస్టు సుస్థిరత ప్రాముఖ్యతను వివరించారు. గ్లోబల్ వార్మింగ్ వంటి ముఖ్యమైన సమస్యలను పరిష్కరించారు. ఇంధన రంగంలో వినూత్న పరిష్కారాల తక్షణ అవసరాన్ని ఎత్తి చూపారు. రిజిస్ట్రార్ డా. కె. సారధి, డీన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ డాక్టరు అవిరేణి శ్రీనివాసులు, డీన్ ఫండెడ్ రీసెర్చ్ డా. ఈశ్వర్ సుంకర, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డాక్టర్. బి. ఎం. సతీష్, డిపార్ట్మెంట్ హెడ్ డా. ఎం. ఎస్. సుజాతతో సహా యూనివర్సిటీ కీలక అధికారులు డీన్లు, విభాగాధిపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్య వ్యలు

మంత్రి సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: ఎన్నికల ప్రచారంలో భాగంగా సత్యవేడు నియోజక వర్గంలోని ఏడు మండలాల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, ఎమ్మెల్యే అభ్యర్థి నూక తోటి రాజేష్‌ని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

నారాయణవనం: దౌర్జన్యాలకు, బెదిరింపులకు బయపడకుండా వైసిపి గెలుపునకు కృషి చేయాలని అందరికీ తాను అండగా ఉంటానని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఎన్నికల సందర్భంగా నాయకులను, కార్యకర్తలను చైతన్యపరచడానికి శుక్రవారం నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్‌తో కలిసి పర్యటించారు. ఉదయం 9.30 గంటలకు నారాయణవనంకు వచ్చిన మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం లభించింది. బస్టాండ్ నుండి సభావేధిక సౌరకాయలస్వామి కల్యాణమండపం వరకు భారీ ర్యాలీగా మంత్రి వెళ్లారు. సభలో మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో రౌడీల దౌర్జన్యాలకు భయపడాల్సిన పనిలేదన్నారు. అందరూ వైసిపి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ మాట్లాడుతూ మండలంలో సుదర్శనరెడ్డి లేని లోటును మంత్రి పెద్దిరెడ్డి భర్తీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే సురాజ్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీరేంద్ర, పార్టీ మండల కన్వీనర్ సౌరకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ ఏపీఎం బాలాజీరెడ్డి, నియోజకవర్గ నాయకులు బుజ్జిరెడ్డి, జెబీఆర్ మునిరత్నం, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎంపీ గురుమూర్తి ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్ తో కలిసి సుడిగాలి పర్యటన నారాయణవనం, కెవిబి పురం, పిచ్చాటూరు మండలాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఇందులో భాగంగా పిచ్చాటూరు మండలం పిడబ్ల్యు గ్రౌండులో ఏర్పాటుచేసిన 'సిద్ధం' సభకి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్ హాజరయ్యారు. వారిని పరిచయం చేస్తూ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సుడిగాలి పర్యటనలో భాగంగా మనిషికి 200 రూపాయలు ఇచ్చి సభకు పిలిపించుకున్నారనే విమర్శలు వినిపించాయి. నియోజకవర్గంలో వర్గ విభేదాలు రామచంద్రారెడ్డి పర్యటనలో బహిర్గత మయ్యాయని కార్యకర్తలు చర్చించుకున్నారు. కోనేటి ఆదిమూలంకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్, ఎంపీ అభ్యర్థి మద్దెల గురుమూర్తి గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిచ్చాటూరు సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి

గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయండి : విసి

పజాశక్తి - క్యాంపస్ : గత వారం రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న గ్రంథాలయ సిబ్బంది ఆయా ప్రాంతాలలో, తమ ప్రాంతాలలో గ్రంథాలయ అభివృద్ధికి, పుస్తక పఠనంపై ప్రజలలో, విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వంగిమల్ల శ్రీకాంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జాతీయ గ్రంథాలయ మిషన్ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు జరుగుతున్న 33వ శిక్షణా తరగతుల్లో పాల్గొంటున్న పౌర గ్రంథాలయ ఉద్యోగులు శుక్రవారం విసి ఆచార్య శ్రీకాంత్ రెడ్డి ని గౌరవ పూర్వకంగా కలిశారు.పుస్తకాల సేకరణ పద్ధతులు, ఆధునిక సమాచార వనరులు వంటి అంశాలపై చక్కని శిక్షణా తరగతులు ఏర్పాటు చేసినందుకు వారు వైస్ ఛాన్సలర్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చొరవతో మంత్రిత్వశాఖ ప్రోత్సాహంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నేటి అత్యాధునిక యుగంలో ప్రతి పుస్తకాన్ని డిజిటలైజ్ చేసి అందరికీ అందుబాటులో వుండేలా చేయడం గ్రంథాలయ ఉద్యోగుల తక్షణ కర్తవ్యమన్నారు. ఈ సమావేశంలో తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ పౌర గ్రంథాలయ సిబ్బంది, తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు రవి, ద్రావిడ విశ్వవిద్యాలయ గ్రంథాలయ అధికారి ఆచార్య దొరస్వామి , యస్వీయూ గ్రంథాలయ అధికారి ఆచార్య సురేంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చివరి విడత నిధులు ఎక్కడ: సిపిఎం

ప్రజాశక్తి -కెవిబిపురం: డ్వాక్రా మహిళలకు రుణమాఫీలో భాగంగా చివర విడత నిధులను ఇంతవరకు మహిళలకు జమ చేయలేదని కారణమేమిటో తెలపాలని సిపిఎం సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి జనార్థన్ తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆర్భాటంగా ఎన్నికల కోడ్ వస్తుందని ముందే జనవరి 23వ తేదీ బటన్ నొక్కి ఆసరా నిధులను విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని, ముఖ్యమంత్రి బటన్ నొక్కి 60 రోజులు అవుతున్నా ఇంతవరకు నిధులు జమ చేయకపోవడం దారుణ మన్నారు. ఎన్నికల సమయంలో ఇలా డ్వాక్రా మహిళలను మోసం చేయడం తగదని విమర్శించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే డ్వాక్రా మహిళలకు ఆసరా చివరి విడత నిధులను విడుదల చేయాలని కోరారు. విద్యార్థులకు కాలేజీలకు చెల్లించే సొమ్మును విద్యార్థులు తల్లిదండ్రుల ఖాతాలో జమ చేస్తానని చెప్పి మూడు నెలలకు ఒకసారి నిధులు జమ చేస్తామని చెప్పి, ప్రస్తుతం ఆరు నెలలు గడుస్తున్నా విద్యా దీవెన నిధులు జమ చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద ముక్కు పిండి వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో నేరుగా విద్యాసంస్థలకు చెల్లించేవారని ప్రభుత్వం ఎప్పుడు చెల్లిస్తే అప్పుడు తీసుకునేవారని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం ఎప్పుడు తల్లిదండ్రుల ఖాతాలకు జమ చేస్తుందో తెలియని అయోమయ స్థితి నెలకొందన్నారు. వెంటనే నిధులు ఇప్పటికైనా ప్రభుత్వం విద్యాదీవెన, వసతి దీవెన, ఆసరా నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



జాబ్ మేళాలో 247 మందిని ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాల్టీ పరిధిలోని గోవింద పాలెంలోని శ్రీ విద్యా డిగ్రీ, ఎంబీఏ కళాశాలలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 20 ఎంఎన్‌సి కంపెనీలలో ఉద్యోగాలకు 532 మంది హాజరుకాగా వివిధ దశలలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో 247 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఏపీ ప్రోగ్రాం మేనేజర్ సిహెచ్ మోహన్, చిత్తూరు జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి వెంకట ప్రసాద్ తెలిపారు. ఈ జాబ్ మేళాలో వివిధ కంపెనీలకు సంబంధించిన హెచ్ ఆర్ మేనేజర్లు ఎన్నికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విద్యా కళాశాల ఛైర్మన్ జి ఉమామహేశ్వర్, ప్రిన్సిపాల్ యం మాణిక్యం, అధ్యాపకులు పాల్గొని ఎంపికైన వారిని అభినందించారు.

జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

'నారాయణ'లో మై కంట్రోలర్‌పై శిక్షణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల ఇసిఇ విభాగంలో పాఠ్యప్రణాళికలో భాగంగా నాలుగు రోజుల 'పరిశ్రమ ఓరియంట్ కోర్సు'లో భాగంగా స్టూడెంట్స్ కి 'మైక్రోకంట్రోలర్' పై శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఇసిఇ విభాగం లోని 'స్వేచ్ఛ లెర్నింగ్ సెంటర్' వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠ్యాంశాలతో పాటు, మైక్రోకంట్రోలర్ ప్రోగ్రామ్ పై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి అయిన విద్యార్థులను, ప్రాంతీయంగా ఉన్న పల్లెటూరులకు వెళ్లి, రైతులను, గృహిణులను కలిసి వారి సమస్యలను తెలుసుకొని, వాటికి సాంకేతిక పరిష్కారాలను విద్యార్థులే స్వయంగా హార్డ్ వేర్ ప్రోటో టైప్ తయారు చేసి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో నేలలో తేమశాతం, వాయుకాలుష్యం ను గుర్తించే పరికరాలు, జలవనరుల సద్వినియోగం, పారిశ్రామిక వ్యర్థాలను నియంత్రించడం, ప్రమాదాలు గుర్తించే పరికరాలు, మొదలయినవి విద్యార్థులు స్వయంగా సర్క్యూట్ తయారుచేసి దాన్ని మైక్రోకంట్రోలర్‌తో అనుసంధానం చేశారు. వారు రాసిన ప్రోగ్రామ్ కోడ్ ప్రకారం పని చేస్తుందో లేదో స్వయంగా తెలుపుకున్నారని ఇసిఇ విభాగాధిపతి డా పి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ ఇస్తున్న ప్రిన్సిపాల్ రవిప్రసాద్

తాగునీటి ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్: ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా శ్రీనివాస సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు శుద్ధి చేసే నీరు అందివ్వడమే లక్ష్యంగా ట్రస్ట్ సేవ చేస్తోంది. బంగారు పేట ప్రాథమిక పాఠశాలలో, రెండు లక్షల పదివేల తో, ఆంధ్రప్రదేశ్ గిరిజన రెసిడెన్షియల్ బాలికల స్కూలులో రెండు లక్షల పదివేల , రూరల్ మండలం పంచాయతీ ఆర్ఎస్ కండ్రిగ ఎస్టీ కాలనీ లో 4 లక్షల 70 వేల తో ఈ ప్రాంతాలలో తాగునీరు సమస్యను పరిష్కరించడానికి ఆర్ఓ ప్లాట్ ను టీవీఎస్ సంస్థ మేనేజర్ జై సింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఎస్టి కాలనీవాసులు శ్రీనివాస సేవా సంస్థ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఎంతోకాలంగా బోరుకొలైలో నీరు తాగి అనారోగ్యానికి గురై కిడ్నీ వ్యాధుల బారిన పడిన సోమసానిగుంట పంచాయతీలోని ఆర్ఎస్ కండ్రిగ, ప్రజలను చూసి టీవీఎస్ వారి దాతృత్వంతో తాగడానికి శుద్ధి చేసిన నీరు ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు అన్నారు. అనంతరం టీవీఎస్ సంస్థ మేనేజర్ జై సింగ్ మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో నీరు తాగడానికి సక్రంగా లేక ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఆరో ప్లాంట్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బంగారు పేట స్కూల్ హెచ్‌ఎం నరేష్, కృష్ణయ్య, ఏపీ గిరిజన పాఠశాల భాస్కర్ రెడ్డి, ఆర్ఎస్ కండిగ కొండయ్య రాజేంద్ర, టీవీఎస్ సంస్థ కేశవ, తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి నూతన ఆవిష్కరణలు

ప్రజాశక్తి - క్యాంపస్ : కళాశాల విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసి రైతాంగ సమస్యలకు పరిష్కారం చూపేలా ఆవిష్కరణలు చేసి తద్వారా అంకుర సంస్థలు ఏర్పాటు చేయడం ద్వారా పది మందికి ఉపాధి కల్పించేందుకు వారిని సమాయత్తం చేసేందుకు ఆర్కేవివై రఫ్తార్ పథకం కింద నడుస్తున్న ఆంగ్రు అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ నేడు అగ్రి విజన్ 1.0 కార్యక్రమాన్ని వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం నిర్వహించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సి రమణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి అగ్రి బిజినెస్ ఇన్స్టిట్యూట్ అధిపతి డాక్టర్ పివి సత్యగోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల విద్యార్థులు విద్య పూర్తి అయిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేచి చూడకుండా తమ తమ విన్నూత్నమైన ఆవిష్కరణలతో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార భద్రత సాధించడానికి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపి అంకుర సంస్థలను ఏర్పాటు చేసుకోవాలని వక్తలు తెలిపారు. అంకుర సంస్థలకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అతిథులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు, ఇన్స్టిట్యూట్ ఆఫ్ అగ్రి బిజినెస్ మేనేజ్మెంట్ విద్యార్థినీ, విద్యార్థులు, మోహన్ బాబు యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు, టీచింగ్ స్టాఫ్, ఎస్వీయూ పీజీ, పీహెచ్డీ స్కాలర్స్, అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ పి.బాలహుస్సేన్ రెడ్డి, బిజినెస్ మేనేజర్ లక్ష్మీతులసి, అసిస్టెంట్ మేనేజర్ అశ్విక్, బిజినెస్ ఎగ్జిక్యూటివ్ సంతోష్, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అక్రమ మద్యం తరలిస్తున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: అధిక ధరకు ఆశపడి ప్రభుత్వ వైన్ షాప్ లో పనిచేసే సేల్స్ మ్యాన్‌లు ప్రభుత్వ వైన్ షాప్ నుండి మద్యం తిరుచానూరుకు అక్రమంగా తరలిస్తుండగా సెబ్ పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. సెబ్ రూరల్ సీఐ కథనం మేరకు.. ఎన్. యుగంధర్ (19), చెంజి సుబ్రహ్మణ్యం (20), అబ్దుల్ రహమాన్ (23), ఎస్ రాజు (36), నలుగురు కలిసి అధిక డబ్బులకు ఆశపడి ప్రభుత్వ మద్యం షాపులో లభించే మద్యాన్ని అధిక ధరలకు విక్రయించేందుకు అక్రమంగా తరలిస్తుండగా సెబ్ పోలీసులు తనిఖీల్లో పట్టుబడ్డారు. ప్రభుత్వ వైన్ షాప్ లో పనిచేసే అబ్దుల్ రెహమాన్, రాజులు సాయంతో ఈ నలుగురు సుమతికి మద్యాన్ని విక్రయించేవారు. మద్యం కొనుగోలు చేసే సుమతి ప్రస్తుతం పరారీలో వుంది. వీరి వద్ద నుంచి సుమారు రూ.15,300 విలువగల 18.36 లీటర్ల మద్యం ఉన్న, 102 రాయల్ ప్యాలెస్, వి ఎస్ఓపి బ్రాందీ క్వార్టర్ బాటిళ్లు, రూ.25వేల విలువ గల బూడిద నలుపు రంగు టీవీఎస్ అప్రిలియా ఎస్సార్, స్కూటీ వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనం ఢీ వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన చంద్రగిరి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. చంద్రగిరి మండలం తిరుపతి- పీలేరు ప్రధాన రహదారి నాగయ్య గారి పల్లి మలుపు నారాయణ జూనియర్ కళాశాల సమీపంలో చిత్తూరు జిల్లా రొంపిచర్ల మండలం బోయపాటి వారి పల్లికి చెందిన కె.సాలమ్మ (63) శుక్రవారం సాయంత్రం తన స్వగ్రామం నుండి కుమారుడు ఉంటున్న చంద్రగిరి మండలం రామిరెడ్డి పల్లె పంచాయతీ వైకుంఠపురం ఎస్టీ కాలనీకి ఆటోలో బయలుదేరింది. రాత్రి 7.30 గంటల సమీపంలో నాగయ్య గారి పల్లి మలుపు వద్ద రహదారిలో ఆటో దిగిన సాలెమ్మ రహదారి దాటుతుండగా తిరుపతి నుంచి పీలేరు వైపు వేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనదారుడు సాలెమ్మను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సాలమ్మ ముక్కు, నోరు, తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆటోలో సమీపంలోని నారావారిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించారు. సాలెమ్మ కుమారుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవీంద్ర నాయక్ తెలిపారు.

గైర్హాజరైన వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలి: కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ప్రిసైడింగ్ అధికారులు ఏపీఓ శిక్షణలో గైర్హాజరైన వారికి షోకాజ్ నోటీస్ లు జారీ చేయాలని, నియోజక వర్గంలో ఆదర్శ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయాలని, ఓటర్ తన ఓటు హక్కు వినియోగించుకునేలా స్వీప్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి అవగాహన కల్పించాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అధికారులు రెండు రోజులకు ఒకసారి పర్యటించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. లక్ష్మీశ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని జిల్లాలోని నోడల్ అధికారులతో ఎన్నికల ఈఆర్ఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఓ లు, పంచాయతీ, గ్రామ రెవెన్యూ అధికారుల స్థాయి వరకు ఎన్నికల సన్నద్ధతపై, పీ.ఓ శిక్షణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

వైసిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులోని శాంతి నగర్ లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ తనయులు రేవంత్ చక్రవర్తి, హేమంత్ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ హయాంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి జరిగిందని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు.

వృద్ధాశ్రమానికి ఫ్రిడ్జ్ వితరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని తెలుగు తల్లి వృద్ధాశ్రమానికి కెపిసి ఫౌండేషన్ వారు కేసి పుల్లయ్య 12వ వర్ధంతి సందర్భంగా రెఫ్రిజిరేటర్ (ఫ్రిడ్జ్) ను వితరణగా ఇచ్చారు. తెలుగు తల్లి వృద్ధాశ్రమానికి శుక్రవారం చేరుకున్న కెపిసి ప్రాజెక్ట్ హెడ్ డీజిఎం ఎం శ్రీధర్, సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ ఎంవివి ప్రసాద్, ఆశ్రమ నిర్వాహకులకు అందించారు.

తాగు నీటిని వృథా చేయొద్దు..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రపంచ తాగు నీటి దినోత్సవం సందర్భంగా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 'నీటిని పొదుపు చేయాలని, తాగునీటి వృథాను అరికట్టాలి ' అనే అంశంపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సులో పుత్తూరు సీనియర్ న్యాయవాది మురుగేష్ రెడ్డి మాట్లాడుతూ నీటి పొదుపు భావితరాలకు భవిష్యత్తు ఉంటుందని నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. భవనాలు నిర్మించినప్పుడు ఇంటివద్ద ఇంకుడు గుంతలు, తప్పక ఏర్పాటు చేసుకోవాలన్నారు, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులు నిష్పక్షపాతంగా పని చేయాలి: బొజ్జల సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రజలు ఎమ్మెల్యే ప్రలోభాలకు లొంగకూడదని ఎన్నికల వేళ అధికారులు నిష్పక్షపాతంగా పని చేయాలని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కోరారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని తన స్వగృహంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొందరు ఐదేళ్ల పాటు వారిని పట్టించుకోకుండా ఎన్నికల వేళ వారిని మభ్య పెడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే నకిలీ పట్టాల బాగోతం బయట పెడతామన్నారు. అర్హులైన వారికి ఇంటి పట్టాలు ఇచ్చి న్యాయం చేస్తామని బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇక శ్రీకాళహస్తి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రవిశంకర్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నందున ఎన్నికల కమిషనుకు ఫిర్యాదు చేశామన్నారు. రవిశంకర్ రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి డిమాండు చేశారు.

రైజింగ్ ఇండియా ఫండ్ ను విడుదల చేసిన టాటా ఏఐఏ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: దేశంలోని ప్రముఖ జీవిత బీమా సంస్థల్లో ఒకటైన టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ (టాటా ఏఐఏ), టాటా ఏఐఏ రైజింగ్ ఇండియా ఫండ్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా టాటా ఏఐఏ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ హర్షద్ పాటిల్ మాట్లాడుతూ టాటా ఏఐఏ అందించే యుఎల్ఐపి ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టడం ద్వారా భారతీయ ఈక్విటీ మార్కెట్ దీర్ఘకాలిక వృద్ధి సంభావ్యత నుండి తమ వినియోగదారులు ప్రయోజనం పొందుతున్నారన్నారు. బాటమ్-అప్ స్టాక్ ఎంపిక విధానంతో, మా పాలసీదారులకు శాశ్వత విలువ, రాబడిని అందించడానికి మేము కట్టుబడి ఉన్నామన్నారు. టాటా ఏఐఏ ఉత్పత్తులు, ప్రతిపాదనల విభాగం ప్రెసిడెంట్ - సిఎఫ్ ఓ అండ్ హెడ్ సమిత్ ఉపాధ్యాయ మాట్లాడుతూ, "ఈ కొత్త ఫండ్ ఆఫర్, టాటా ఏఐఏ రైజింగ్ ఇండియా ఫండ్ ను , ప్రో-ఫిట్, పరమ్ రక్షక్ సొల్యూషన్, పరమ్ రక్షక్ ప్లస్ సొల్యూషన్ మొదలైన మా ప్రత్యేకమైన పరమ రక్షక్ సిరీస్‌తో పాటు పొందవచ్చు అన్నారు. కొత్త ఫండ్ ఆఫర్‌తో వినియోగదారులు పిఆర్ సిరీస్ ప్రతిపాదనను చాలా ఆకర్షణీయంగా కనుగొంటారని, వారి పెట్టుబడి, బీమాను అందుకుంటారని తెలిపారు. వినియోగదారులు దీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రుక్మాంగధ రెడ్డి మృతి వైసిపికి తీరని లోటు: మంత్రి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపాల్టీ వైసిపి సీనియర్ నాయకులు, కెటి ప్రసాద్ రెడ్డి సోదరులు రుక్మాంగధ రెడ్డి మృతి వైసిపికి తీరని లోటని మంత్రి రోజా పేర్కొన్నారు. రుక్మాంగధ రెడ్డి మృతదేహానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కె రోజా పూల మాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రుక్మాంగధ రెడ్డి ఆకస్మిక మృతి వారి కుటుంబానికి, వైసీపీకి తీరని లోటు అని తెలిపా రు. రుక్మాంగధ రెడ్డి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. మంత్రి వెంట మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి జయప్రకాష్. డీశంకర్, న్యాయవాది రవీంద్ర, వైసిపి ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

O.S.NO. 378 / 2021

కందాటి రాఘవరెడ్డి ...వాది

V/s

తిరగాబత్తినపుల్లయ్య ... ప్రతివాది

నోటీసు

TO:
తిరగాబత్తిన పుల్లయ్య, S/o. రమణయ్య, D.No.13/118, రాజావీది, Opp: శ్రీ వెంకటేశ్వరస్వామి గుడి, గూడూరు టౌన్ మరియు మండలం, తిరుపతి జిల్లా (గతంలో నెల్లూరు జిల్లా)

అయ్యా

పై దావాలోని వాది తన బాకీని రాబట్టుకొనే నిమిత్తం మీపై పైకోర్టులో పై నెంబరు గల దావా దాఖలు చేసియున్నాడు. సదరు దావా మీ నోటీసు నిమిత్తం తేది:16.04.2024న వాయిదా పడియున్నది. ఆ దినమున ఉదయం 10:30 గం॥లకు పై కోర్టు ఎదుట మీరు నేరుగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు,
యం.వెంకట క్రిష్ణయ్య
వాది తరపు న్యాయవాది,
గూడూరు, సెల్: 8897654193.